ప్రజాశక్తి
గురువారం 4 ఏప్రిల్ 2024



వెలుగు కార్యాలయ స్థలం పరిశీలన

ప్రజాశక్తి హుకుంపేట: వెలుగులో కార్యాలయం సిబ్బంది పిర్యాదు మేరకు బుధవారం డీప్యూటీ తహశీల్దార్, మండల సర్వేయర్లు వెలుగు కార్యాలయం స్థలాన్ని సర్వే నిర్వహించి పరిశీలించారు. బుడ్డిగ కొండమ్మ అక్రమించిన స్థలాన్ని దగ్గర ఉండి పరిశీలించి వెలుగు కార్యాలయం సిబ్బందికి అప్పజెప్పారు. అనంతరం డీప్యూటీ తహశీల్దార్ సీహెచ్ కృష్ణారావు మాటాడుతూ, ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు వెలుగు కార్యాలయం సిబ్బందికి సదరు స్థలాన్ని అప్పగిం చామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో కొండబాబు, ఏపిఎం కృష్ణారావు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పింఛన్ల కోసం పడిగాపులు

-సచివాలయాల వద్ద నిరీక్షణ
-ఏజెన్సీలో పరిమితంగానే పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు:

మన్యంలో పింఛనుదారులు అవస్థలు పడ్డారు. బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందని సమాచారంతో వృద్ధులు, వితంతులు తదితర లబ్ధిదారులంతా ఉదయం నుంచే సచివాలయాలకు తరలివచ్చారు. కొందరు మధ్యాహ్నం వరకు మరికొందరు సాయంత్రం వరకు పింఛన్ల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో వృద్ధులకు కాస్త అలసటతో పాటు కొన్ని గంటలపాటు నిరీక్షణ తప్పలేదు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయాల్లో సిబ్బంది పింఛన్లు పంపిణీ చేపట్టారు. కొన్నిచోట్ల నెట్వర్క్ సమస్య, నగదు రాకపోవడంతో తదితర కారణాలతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద గంటలకు నిరీక్షించాల్సి వచ్చింది.

అల్లూరి జిల్లా వ్యాప్తంగా మొత్తం ఒక లక్ష ఇరవై ఎనిమిది వేల పింఛన్ల లబ్ధిదారులకు పింఛన్లు సొమ్ము బట్వాడా చేయవలసి ఉంది. ఈనెల ఆరవ తేదీ వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు బట్వాడా నిర్వహించాలని ఎన్నికల కమిషన్ సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.


అరకులోయ మండలం లోతేరు సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

అల్లూరి డెస్క్:అరకులోయ మండలంలోని లబ్ధిదారులు పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. అరకులోయ మండలం లోతేరు పంచాయితీ పరిధి తోటవలస, వివిధ గ్రామనికి చెందిన వృద్ధులు, వికలాంగులు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న లోతేరు గ్రామ సచివాలయం వద్దకు బుధవారం కాలినడన చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత రావాలని సచివాలయ సిబ్బంది చెప్పడంతో వృద్ధులు, వికలాంగులు తిరిగి ఇంటికి వెళ్లలేక, ఎండకు మళ్లీ రాలేక సచివాలయం వద్ద వేచి ఉన్నారు.ప్రతి నెల 1వ తేదీన వాలంటీర్లు ఇంటికి తెచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వాలంటీర్లతో పంపిణీని నిలిపేశారు. సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఫించన్లు అందక అవస్థలు పడ్డారు. మండలంలో 6,630మంది పింఛనుదారులు ఉండగా సుమారు 150మందికి మాత్రమే పింఛన్లు అందేశారు.


గన్నేరుపుట్టులో వేచిచూస్తున్న పింఛనుదారులు

హుకుంపేట:గన్నేరుపుట్టు పంచాయతీ సచివాలయం వద్ద పింఛన్‌ల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాశారు. ఉదయం నుంచి పింఛన్‌ల కోసం పడిగాపులు కాస్తూ ఇబ్బంది పడ్డారు.మండలంలో 33 పంచాయతీలు ఉండగా 4 పంచాయతీలకు మాత్రమే పింఛన్లు అందజేశారు.


డుంబ్రిగుడ మండలం అరకుకు ఆటోలో వస్తున్న వృద్ధుడు

డుంబ్రిగుడ : పింఛన్లు తీసుకోవడానికి పంచాయతీ పరిధిలోని సచివాలయాలకు వచ్చిన గిరిజనులు పలు ఇబ్బందులు పడ్డారు. మారుమూల గ్రామం నుంచి పింఛన్ల కోసం వచ్చినా పంపిణీ కాకపోవడంతో నిరాశతో లబ్ధిదారులు వెనుదిరిగారు. మండలంలోని అరకు మేజర్ పంచాయతీలో పింఛన్ కోసం కాళ్లు చొచ్చు బడిన పింఛన్ లబ్ధిదారుడిని ఆటోలో సచివాలయానికి వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.

డబ్బులు రాక పింఛన్ల ఆగిన పంపిణీ

అడ్డతీగల:ఏజెన్సీలో డబ్బులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో బుధవారం జరిగాల్సిన పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. అడ్డతీగల పంచాయతీకి సుమారు రూ.10.50 లక్షలు పెన్షన్ డబ్బులు రావాల్సి ఉండగా, 3వ తేదీ నాటికి యూనియన్ బ్యాంక్‌కి రూ.3 లక్షలు మాత్రమే వచ్చాయి. వాటిని డ్రా చేయడానికి సాంకేతిక లోపం ఉండడంతో అవి కూడా రాలేదని, దీంతో చేసేదేమీ లేక 4వ తేదీ నుండి పింఛన్లు పంపిణీ ప్రారంభిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. దీంతో ఉదయం నుండి నిరీక్షించిన పింఛనుదారుల చేసేది లేక నిరాశతో వెనుదిరిగారు.

మారేడుమిల్లి : పింఛన్లు ఇస్తారని బుధవారం ఉదయమే సుదూర ప్రాంతాల నుంచి సచివాలయాల వద్దకు చేరుకొని లబ్ధిదారులు నిరీక్షించారు. అయితే డబ్బు ఇంకా రాలేదంటూ సచివాలయ వెనక్కి పంపిచేశారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీ పరమేశ్వరిని వివరణ కోరగా పెన్షన్ నగదు ఇంకా క్రెడిట్ కాలేదని, సాయంత్రం లోపు వస్తే ఇంటింటికి పంపించి పంపిణీ చేస్తామని చెప్పారు.

చింతూరు : బ్యాంక్‌లో డబ్బులు లేక పోవడంతో చింతూరు మండలంలో పింఛన్లు పంపిణీ ఆగిపోయింది. ఈ విషయంపై చింతూరు సచివాలయం సెక్రటరీ ప్రసాద్‌ను వివరణ కోరగా బ్యాంకులో సరిపడ డబ్బులు లేనందున పించన్‌లు ఇవ్వలేక పోయామని, గురువారం అందరికీ పింఛన్లు అందజేస్తామని తెలిపారు.

రాజవొమ్మంగి : సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేస్తారని సమాచారంతో దూర ప్రాంతాల నుండి వచ్చిన లబ్ధిదారులు ఇక్కడ పింఛన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మండలంలో 6681 మంది వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛను లబ్ధిదారులు ఉండగా, వారికి సుమారు రూ1.95 కోట్లు ప్రతి నెల చెల్లించాల్సి ఉంది. కాని ఈ మొత్తం బుధవారం రాలేదు. దీనిపై ఎంపీడీవో ను వివరణ కోరగా పింఛన్లు నగదు ఇంకా క్రెడిట్ కాలేదని సాయంత్రంలోపు డబ్బు వస్తే పంపిణీ చేస్తారని తెలిపారు.

విఆర్.పురం : మండలంలో పింఛనుదారులు బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం 12 గంటల పింఛన్లు కోసం ఎదురు చూశారు. డబ్బులు బ్యాంకులో పడలేదని, నాలుగో తేదీన పెన్షన్ ఇస్తామని చెప్పడంతో చేసేదేమి లేక వెనుదిరిగారు.

సాయంత్రం నుండి పంపిణీ

కూనవరం : మండలంలోని పలు పంచాయితీలలో సాయంత్రం నుండి పింఛన్ల పంపిణీ చేశారు. మండల కేంద్రంలో రాత్రి వరకు పంపిణీ కొనసాగింది. కొన్ని పంచాయితీలలో మాత్రం సుదూర ప్రాంతాలకు వెళ్లలేక పింఛను పంపిణీ జరగలేదు.

సిపిఎం గెలుపుతోనే ఏజెన్సీ సమగ్రాభివృద్ధి

ఆ పార్టీ నేతలు వెంకటేశ్వర్లు, లోతా రామారావు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అన్నారు. మారేడుమిల్లిలో ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, దానితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన కూటమిని, నిరంకుశ వైసిపిని ఓడించాలని, లౌకిక శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మండలంలో రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాల కోసం సిపిఎం పోరాడిందని గుర్తు చేశారు. కొండపోడు పట్టాలు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోసం ఉద్యమించినట్లు చెప్పారు. సిపిఎం గెలిస్తే జీవో నెంబర్ 3 చట్ట సవరణ కోసం అసెంబ్లీలో ప్రశ్నిస్తామని, 1/70 అమలు కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, ఏలూరు జిల్లా నాయకులు ఎం నాగమణి, టి రామకృష్ణ, మండల నాయకులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, వీకా రాజన్నదొర, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు

సిపిఎం అభ్యర్థికే మా ఓటు

సాలెబుడప గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం


నినాదాలు చేస్తున్న సాలెబుడప గ్రామస్తులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎటపాక

ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే సిపిఎం అభ్యర్థికే తమ ఓటు వేస్తామని మండలంలోని విస్సాపురం పంచాయతీ పరిధి సాలెబుడప గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసి సిపిఎం నాయకులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో పలు సమస్యలను పరిష్కరించి, సమస్యలు వచ్చిన ప్రతి సందర్భంలో తమకు వెన్నంటి నిలిచిన సిపిఎంకే తమ ఓటు వేస్తామని తీర్మానం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీలకు అండగా నిలిచే పార్టీ సిపిఎం ఒకటేనని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, గ్రామాల అభివృద్ధిలో సిపిఎం దిక్సూచిగా నిలిచిందన్నారు. చట్టసభల్లో సిపిఎం ప్రతినిధి ఉండాల్సిన అవసరం ఈ సమయంలో ఎక్కువగా ఉందని చెప్పారు. సిపిఎం సభ్యులు చట్ట సభల్లో లేనందు వల్లే గిరిజన చట్టాలకు హక్కులకు భంగం కలుగుతుందని తెలిపారు. అందువల్ల ఆదివాసీలంతా ఆలోచించి ఒక తాటిపైకి వచ్చి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సాలెబుడప గ్రామస్తుల వలే మిగతా గిరిజన గ్రామాల్లో కూడా నిర్ణయించుకుంటే సిపిఎం అభ్యర్థి రంపచోడవరం నియోజకవర్గంలో సునయాసంగా గెలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇరప అజయ్, సోయం వీరమ్మ, పర్సిక ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రచారం

ప్రజాశక్తి -రంపచోడవరం

వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలో కె.యర్రంపాలెంలో ఎమ్మెల్సీ అనంతబాబు బుధవారం ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వం గ్రామాలలో తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేసిందని, పాఠశాలలను అభివృద్ధి చేసిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓట్లు వేసి రంపచోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీ అభ్యర్థి గీతను ఓడించండి

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర

ప్రజాశక్తి- అల్లూరి డెస్క్:కూటమి బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను ఓడించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర తెలిపారు. బుధవారం అరకులోయ గిరిజన భవనంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, రామన్న, జగన్నాధంతో కలిసి స్థానిక విలేకరులు సమావేశంలో మాట్లాడారు.అదాని హైడ్రో పవర్ ప్రాజెక్ట్, షిరిడి సాయి ఎలక్ట్రికల్ బడా పెట్టుబడిదారుల నుంచి లంచాలు తీసుకుని పోటీ చేస్తున్న వైసిపి, బీజేపీ టీడీపీ, జనసేన అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కులు, చట్టాల అమలుకై పోరాటం చేస్తున్న సిపిఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపిస్తే ఆదివాసిల గొంతు వినిపిస్తారని తెలిపారు. అటవీ పర్యావరణం చట్టం రద్దు చేసి ఆదివాసి ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. పోలవరం నిర్వాసిత ఆదివాసులకు ఇప్పటివరకు న్యాయం చేయలేదన్నారు. ప్రత్యేక హెూదా ఇవ్వకుండా ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేసిన బిజెపిని ఓడించాలన్నారు. బీజేపిని 400 ఎంపీ సీట్లతో గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటన చేస్తున్నారని దుయ్యబట్టారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందించాలని, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి, గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ నియమించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సురేంద్ర


అరకులోయలో కురుస్తున్న వర్షం

చల్లబడిన మన్యం - పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయలో బుధవారం మధ్యాహ్నం తొలకరి వాన కురిసింది. ఎండ తీవ్రతతో గిరిజనులు అల్లాడుతుండగా వాన కురవడంతో ఈ ప్రాంత వాసులు సేద తీరారు. ఇంతవరకు తీవ్రమైన ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మన్యప్రాంత వాసులకు తొలకరి వాన పలకరించడంతో ఈ ప్రాంతమంతా ఒక్కసారిగా చల్లబడింది. అరకులోయను సందర్శించే పర్యాటకులు సైతం ఆనందించారు. ఈ ఏడాది మునుపెన్నడు లేని విధంగా మామిడి పూత వచ్చింది. సరైన సమయానికి వర్షం రాకపోవడంతో దిక్కులు చూస్తున్న రైతులకు ఈ తొలకరి వర్షం ఎంతగానో ఉపయోగపడిందని పలువురు రైతులు అన్నారు. ఉరుములు మెరుపులతో వాన కురవడంతో వర్షపు నీటితో రోడ్లన్నీ నిండాయి.

డుంబ్రిగుడ: మండలంలో బుధవారం తొలకరి వర్షం కురిసింది. కొన్ని నెలలుగా వర్షం కురవక పోవడంతో పాటు వేసవికాలం ప్రారంభం నుంచి భానుడి ప్రతాపానికి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండల తీవ్రతతో గిరిజనులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. బుధవారం మధ్యాహ్నం తొలకరి వర్షం కురవడంతో వాతావరణం కొంత చల్లబడటంతో మండల వాసులు కొంత ఉపశమనం పొందారు.

వైసిపి పాలనలో అభివృద్ధి ఏదీ?

-పాడేరు టిడిపి అభ్యర్థి కిల్లు రమేష్ నాయుడు

ప్రజాశక్తి పాడేరు:- రాష్ట్రంలో గత ఐదేళ్లుగా అరాచక పాలన సాగిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు సమీపించాయని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి ఇల్లు రమేష్ నాయుడు అన్నారు. బుధవారం ఆయన నివాస గృహంలో తొలిసారి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ పట్ల గిరిజనులు అంతా సుముఖంగా ఉన్నారని చెప్పారు.కిల్లు రమేష్ నాయుడు గెలుపుకు ఉమ్మడి కృషి చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి ఒంపురు గంగులయ్య వెల్లడించారు. స్థానిక జనసేన కార్యాలయంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓటర్లను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అడప నరసింహ మూర్తి నాయుడు, శోభ శ్రీను, ఉల్లి రామారావు పాల్గొన్నారు.

వెంకన్న విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి - విజయనగరం జిల్లాల సరిహద్దు గ్రామమైన ఎగువ కొండపర్తిలో వేంకటేశ్వరుని ఆలయంలో విగ్రహాన్నిబుధవారం ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త కర్రీ సముద్రరెడ్డి మాట్లాడుతూ,ఈ ఆలయానికి అనంత వెంకటేశ్వర ఆలయంగా నామకరణం చేశామని తెలిపారు. స్వామి స్వరూపానంద సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలు ప్రత్యేక పూజలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గ్రామాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్లో బుధవారం ప్రాజెక్ట్ అధికారి వివిధ శాఖల అధికారులతో మౌలిక సదుపాయాలు ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని బాగా వెనుకబడిన కొండరెడ్డి తెగలు వారు నివసించే ప్రాంతాల్లో కరెంటు, రహదారులు, పక్కా గహాలు, తాగునీరు వంటి సౌకర్యాలపై ఐదు సంవత్సరాల యాక్షన్ ప్లాన్ నివేదికలు సమర్పించాలని సూచించారు. అన్ని ఆశ్రమ పాఠశాలలకు ఫైబర్ నెట్ సౌకర్యం, ఏడు మండలాల్లోని సుమారు 300 గ్రామాలకు బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ సెల్‌ఫోన్ నెట్ సౌకర్యం ఏర్పాటు, ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, పిహెచ్‌సిల్లో బర్త్ వెయిటింగ్ హాలు, కొత్తగా విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు, జిసిసి డిఆర్ డిపోలకు పక్క భవనాలు, గొడౌన్లు, సకాలంలో రేషన్ సరఫరాకు కావాల్సిన సౌకర్యాలు, కమ్యూనిటీ భవనాలు, మ్యూజియంలు ఏర్పాటు వంటిపై ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. పైనా పేర్కొన్న వివిధ శాఖలకు సంబంధించిన ఐదు సంవత్సరాల యాక్షన్ ప్లాన్లు పూర్తిస్థాయిలో సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబు సలాం, ఏడియంహెచ్ఒ జి.ప్రకాశం, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, యండి.యూసఫ్, ఏ.రవికుమార్, సిడిపిఒ సంధ్యారాణి, డిప్యూటీ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, శ్రీనివాసరావు, యస్ఒ టి.మార్తమ్మ, జిసిసి ఎస్ఎం యం.నాగ వెంకట రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనులు సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉంచాలని సీలేరు ఎస్ఐ రామకృష్ణ అన్నారు. జికె.వీధి మండలం మావోయిస్టు ప్రభావిత గుమ్మిరేవులు, చెరుకుమల్లు గ్రామాల్లో బుధవారం ఎస్ఐ పర్యటించారు. గిరిజనులతో సమావేశమై మాట్లాడారు. యువత మంచి మార్గాల వైపు నడిచి ఉన్నతమైన చదువుల అభ్యసించాలన్నారు. యువత చైతన్యవంతులైనప్పుడే గ్రామాలు అభివద్ధికి బాటలు వేయవచ్చని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేకపోతే ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. గంజాయి తదితర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు. అపరచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీలేరు ఎస్ఐ రామకృష్ణ


సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

సీనియర్లకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామా

ప్రజాశక్తి-అడ్డతీగల

రంపచోడవరం నియోజకవర్గం టిడిపి టికెట్‌పై పున:పరిశీలిన చేసి సీనియర్లకు ఇవ్వాలని, లేకుంటే రాజీనామా చేస్తామని ఆ పార్టీ మండల సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ అన్నం సత్యనారాయణరెడ్డి నాయకత్వంలో టిడిపి అడ్డతీగల మండల నాయకులు, సీనియర్ గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జిల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు మరో సారి ఆలోచించి పార్టీలోని సీనియర్లలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని చెప్పారు. కార్యకర్తల మనోభావాలను వ్యతిరేకంగా మిరియాల శిరీషాదేవినే కొనసాగిస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ విషయాన్ని టిడిపి రంపచోడవరం నియోజవర్గం పరిశీలకులకు, పార్టీ అధిష్టానానికి తెలియజేస్తామని పార్టీ మండల అధ్యక్షులు జత్తా రమణ తెలిపారు.



ఊటగెడ్డను తవ్వుతున్న గిరిజనులు

ఒంటిపుట్టులో తాగునీటికి కటకట

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయతీ ఒంటిపుట్టు గ్రామంలో గత ఏడు రోజులుగా తాగునీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సూకురామన్న, లక్ష్మి, చిట్టమ్మ, చిన్నమ్మ, ఈశ్వరి, గాంను, సోన్ని తమ ఆవేదనను వెలిబుచ్చారు. గ్రామంలో 12 గృహాలు ఉండగా 40 మంది జనాభా ఉన్నారు. మంచినీటి పైపులు ఉన్నప్పటికీ గురి కావడంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డకు ఆనుకొని ఉన్న ఊట గెడ్డలో చిన్న గోతులు తీసి దానిలో నీరు సేకరించి తాగునీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు వాపోయారు. బురదమయంగా ఉన్న నీటిని సేకరిస్తున్నామన్నారు. గెడ్డల్లో నీటిని వడపోసి సేకరించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రతకు నీరు ఇంకి పోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి ఒంటిపుట్టు గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కే రఘుపతి, మంగు రమేష్, సుందర్‌రావు, వీరన్న, వెంకటరమణ, గణేష్‌లు కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు...

పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

ఎన్‌పిఆర్‌డి అల్లూరి జిల్లా నాయకులు పాంగి బాలకృష్ణ

ప్రజాశక్తి -అల్లూరి డెస్క్: విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్.పి.ఆర్.డి) అల్లూరి జిల్లా నాయకుడు పాంగి బాలకృష్ణ డిమాండ్ చేశారు. అరకు ఆదివాసీ గిరిజన భవనంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వేలాది మంది వికలాంగులు కష్టాల్లో ఉన్నారని, వికలాంగుల చట్టం 2016 అమలు కాకపోవడంతో భద్రత కరువైందని తెలిపారు. సంక్షేమ పథకాల్లోనూ పాలకులు కోతపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన పార్టీలకే వికలాంగుల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల చట్టాన్ని, పథకాలను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఉద్యోగాల్లో ఎటువంటి నియమ నిబంధనలు పెట్టకుండా మోటారు వాహనాలు, ఇతర ఉపకరణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేలా చర్యలు చేపట్టాలని, బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని కోరారు. వికలాంగుల కార్పొరేషన్ ద్వారా పూర్తి సబ్సిడీతో పది లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని ఐదు లక్షలకు పెంచాలని కోరారు. అంత్యోదయ కార్డు ఇచ్చి 35 కిలోల బియ్యం పంపిణీ చేయాలని, ఇతర నిత్యావసరాలను, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రతి కుటుంబానికి 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

కూటమి, వైసిపి అభ్యర్థులను ఓడించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం అని బహిరంగ ప్రకటన చేస్తున్న బిజెపిని, ఆ పార్టీతో అలయెన్స్‌లో ఉన్న టిడిపి, జనసేనను, దళిత బాధితుల డోర్ డెలివరి చేసి, సంక్షేమ పథకాలను సమాధి కట్టిన వైసిపిని ఓడించాలని దళిత ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పిలుపునిచ్చారు. అంబేద్కర్ భవన్ వద్ద పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భారత రాజ్యాంగానికి ఆదుర్దాగా తూట్లు పొడుస్తోందన్నారు.

ఓటుతో మెరుగైన సమాజం

-14వ తేదీ వరకూ ఓటు హక్కు నమోదు
జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి -పాడేరు : మెరుగైన సమాజం, ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఓటే పునాదని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని పటిష్టమైన ప్రజా స్వామ్యానికి పునాది వేయాలని పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ వరకు ఓటు హక్కు నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. స్థానిక ఎపి గురుకులం కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన (స్వీప్) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం నిర్మాణానికి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేసారు. ఇంకా ఎవరైనా ఉంటే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 7.70 లక్షల మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎటపాక, కూనవరం మండలాల నుండి అనంతగిరి మండలం వరకు జిల్లాలో స్వీప్ కార్యక్రమం నిర్వహించి మారుమూల ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నామని చెప్పారు. ప్రలోభాలకు లోను కాకుండా కులం, మతంలను చూడకుండా విజ్ఞతతో ఓటు వేయాలని స్పష్టం చేసారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట మాట్లాడుతూ, ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ తొంబై శాతం ఓటు నమోదు లక్ష్యంగా నిర్దేశించు కున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు సమకూర్చామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగంచు కోవాలని కోరారు.అదనపు ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ, ఓటర్లందరూ నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పటిష్టమై భద్రతా పర్యలు చేపట్టామన్నారు. ప్రలోభాలకు లోను కాకుండా ప్రజామ్యబద్ధంగా ఓటు వేయాలన్నారు. ఓటును అడ్డు కుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.రంప చోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్లుందరూ ఓటు వేయాలని సూచించారు. ముందుగా జి.మాడుగుల, కె.కోడాపల్లి గ్రామాలకు చెందిన స్వయం సహాయ సంఘాల సభ్యులు కోలాటంతో స్వాగతం పలికారు.ఉత్తమ రంగ వల్లులకు బహుమతులను అందజేసారు.వివిద మహిళా సంఘాల సభ్యులు దీంసా, కోలాటం నృత్యాలు ప్రదర్శించి అలరించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పిఓ కోలాటం ప్రదర్శనలో పాల్గొని సందడి చేసారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు ధాత్రి రెడ్డి, డి.ఆర్.ఓ. పద్మావతి, ఎస్‌డిసి వి.వి.ఎస్. శర్మ, డిఆర్‌డిఏ. పిడి. వి.మురళి, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-ముంచంగి పుట్టు :సిపిఎం అరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిలో సురేంద్ర, సిపిఎం నేత ఎన్నికల పరిశీలకులు ఆర్.శంకర్‌రావు కోరారు. ఆ పార్టీ మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసుల చట్టాలు, హక్కుల రక్షణకు, చట్టసభల్లో గట్టిగా పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు.చట్టాల రక్షణ కోసం ఆదివాసులకు అండదండగా సిపిఎం ఉంటుందన్నారు. సిపిఎం నేత, ఎన్నికల పరిశీలకులు ఆర్.శంకర్‌రావు మాట్లాడుతూ, పలు కంపెనీల నుంచి బీజేపీ, వైసిపి, టీడీపీ పార్టీలు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో కోట్ల రూపాయలు తీసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, మండల కార్యదర్శి భీమరాజు, సీనియర్ నాయకులు ఎస్.గాసీరందొర, ఎం.నర్సింగ్ పడాల్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య, జి.నారాయణ, పి.రామదాసు, విజయ, ఈశ్వరి, విక్రమ్, డంబ్రు, దనూర్జయ్, సొద, కామేష్, గణపతి పాల్గొన్నారు.

ఎఆర్‌సికి ఎలుగుబంటి తరలింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం, మెట్టూరు గ్రామంలో ఒక పాడుబడిన ఇంట్లో దాక్కున్న ఒక ఎలుగుబంటిని శ్రీకాకుళం అటవీ డివిజన్ అధికారుల సమన్వయంతో మంగళవారం సాయంత్రం విశాఖలోని జూ పార్కుకు సురక్షితంగా తరలించారు. ఎలుగుబంటికి జూ వైద్యుడు ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా శరీరంపై కొన్ని గాయాలైనట్టు గుర్తించారు. ప్రాథమిక చికిత్స అందించి జంతు సంరక్షణా కేంద్రానికి తరలించినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ వై.రామకృష్ణ కథనం ప్రకారం... పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బాపన్ మండలం, అతని భార్య తుంప మండలం 8 ఏళ్ల కుమార్తెతో కలిసి మారికవలస పిపిటి కాలనీలో నివాసముంటున్నారు. బాపన్ మండలం పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత నెల 29వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన తుంప మండలం తిరిగి ఇంటికి రాలేదు. దాంతో ఆమె భర్త చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పిఎం.పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం పంచాయతీ, శ్రమజీవులు కాలనీలో బుధవారం మహిళ అనారోగ్యంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రమజీవుల కాలనీలో కొత్తవలస రాంబాబు, ఆయన భార్య లక్ష్మీతులసి (40), కుమార్తెలు శిరీష (23) లావణ్య (20) ఉంటున్నారు. లక్ష్మీతులసి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యాన్ని తట్టుకోలేక బుధవారం ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు కుటుంబీకులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సిఐ తిరుపతిరావు ఆధ్వర్యాన ఎస్‌ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న అరకు వైసిపి ఎన్నికల పరిశీలకులు హైమావతి

సమన్వయంతో పనిచేస్తే విజయం

వైసిపి నియోజకవర్గ పరిశీలకులు హైమావతి

ప్రజాశక్తి -అరకులోయ :వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు సమన్వయంతో పని చేస్తే విజయం తథ్యమని అరకు నియోజకవర్గం వైసీపీ పరిశీలకురాలు శోభా హైమావతి దేవి అన్నారు. పార్టీ నాయకుల్లో ఉన్న చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకొని అంకితభావంతో సమన్వయంతో పని చేస్తే వైసిపిదే విజయం అని ఆమె అన్నారు.మండలంలోని పద్మాపురం రిసార్ట్లో బుధవారం జరిగిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు.నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు ఉండడం సహజమేనని, వాటిని సరిదిద్దుకోవాలని ఆమె అన్నారు. రేగం మత్స్యలింగం, గుమ్మ తనుజరాణిని గెలిపించాలని కోరారు. వైసిపి జిల్లా అధ్యక్షురాలు కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పార్టీ కోసం ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కుంభ రవిబాబు మాట్లాడుతూ, పార్టీ నిర్ణయానికి ప్రతి ఒక్కరు కట్టుబడి పని చేయాలన్నారు. ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మ తనుజరాణి, రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, చిన్నచిన్న లోపాలు అపార్థాలు ఉంటే సరిచేసుకుని తమను గెలిపించాలని కోరారు.అరకులోయ మండల వైసీపీ అధ్యక్షుడు అరకులోయ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్. లక్ష్మణరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఛైర్పర్సన్ సుభద్ర, ఎంపీపీ రంజపల్లి ఉషా రాణి, మండల జడ్పీటిసి సభ్యురాలు శెట్టి రోషిణి, వైఎస్ఆర్సిపి మాజీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, అరకు మార్కెట్ యార్డ్ చైర్మన్ కిల్లో రాజ రమేష్, రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభా సోమేశ్వరి, మండల సర్పంచ్ పోరం అధ్యక్షులు పాడి రమేష్,తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ హిమబిందు

పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : క్షయ రోగులు పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డికె.హిమబిందు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోహెన్స్ లైఫ్ సైన్స్ సిఎస్ఆర్‌లో భాగంగా క్షయ రోగులకు అందజేసిన నిక్సాయ్ మిత్ర ఫుడ్ బాస్కెట్లను వైద్యాధికారి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ రోగులకు నాణ్యమైన పోషకాహారం అందించే లక్ష్యంతో ఈ నిక్సాయ్ మిత్ర ఫుడ్ బాస్కెట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ ఫుట్ బాస్కెట్ల ద్వారా ఆయిల్, రాగి పిండి, వేరుశనగ, శనగపప్పు, కందిపప్పు బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. క్షయ బాధితులు త్వరగా కోలుకునేందుకు పోషకాహారం చాలా ప్రాముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, ఎంపిహెచ్ఈఓ పోతురాజు, ఫార్మసిస్ట్ మూర్తి, ఎస్టిఎస్ జి.అశోక్ కుమార్, ఎస్టిఎల్ఎస్ వెంకటరావు పాల్గొన్నారు.

కోవర్టులతో కలిసి పని చేయలేం

ప్రజాశక్తి-రంపచోడవరం : జనసేన పార్టీని అమ్మేసే కోవర్టులతో కలిసి తాము పని చేయలేమని పలువురు జనసేన నాయకులు స్పష్టం చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనసేన పార్టీ పెట్టిన దగ్గర నుండి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి 11 మండలాల్లో పవన్ కళ్యాణ్ అభిమానులను జనసైనికుల్లా మార్చి పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన వారిని కాదని, ఆరు నెలల క్రితం వైసిపి నుంచి వచ్చిన కుర్ల రాజశేఖర్‌కు టీడీపీ, జనసేన సమన్వయకర్తగా నియమించారని తెలిపారు. కనీస పార్టీ మండల అధ్యక్షుల అభిప్రాయాలను కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పిర్పి శ్రీను, మల్ల దుర్గ ప్రసాద్, కొనతం శ్రీనివాస్ వంటి వారితో కలిసి పని చేయలేమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ మండలాల జనసేన నాయకులు కాకి స్వామి, నర్శి ఎర్రయ్య, రాగల సురేష్, చుప్పల కన్నబాబు, చారపు వెంకట రాయుడు, కర్రి మహేష్, తురసం సీతారామంజనేయులు, కుంజం శ్రీనివాస్, ముడివి రాజీ, తీగల రవి, సాంబ శివరావు, మెలా సతీష్, కుంజం సిద్దు, పల్లల కృష్ణ, దుర్గాప్రసాద్, తాటికొండ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో ఝాన్సీ, వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ 34వ వార్డులో బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇరువురూ రోడ్డు షో నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ప్రచారంలో అగ్రభాగాన ఉన్నారు. 34వ వార్డులో అచ్చిమ్మపేట వద్ద రోడ్డు షో ప్రారంభమై డాల్ఫిన్ రోడ్డు మీదుగా 75 అడుగుల రోడ్డు వయా భూపేష్ నగర్ జెండా చెట్టు, లక్ష్మీదేవి పేట, నేతాజీ నగర్ ప్రాంతాల గుండా సాగింది. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ తమను గెలిపిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎదురెదురుపడ్డ వాసుపల్లి, లక్ష్మీనారాయణ

దక్షిణ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఉత్తర నియోజవర్గం జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి, ఆ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ బుధవారం ఒకే చోట ఎదురెదురు పడ్డారు. ఆసక్తికరమైన ఈ సంఘటన ఆశీలుమెట్టలోని శ్రీ సంపత్ వినాయక ఆలయం వద్ద జరిగింది. వీరిద్దరూ ఒకరికొకరు అభివాదం చేసుకున్నారు. రాజకీయ అంశాలపై కాసేపు ముచ్చటించుకున్నారు.

విఎంఆర్‌డిఏ భూమి ఆక్రమణ

టేకు చెట్లు నరికివేత
రూ.60 కోట్ల విలువైన ఆస్తి ప్రయివేటు వ్యక్తుల పరం
పట్టపగలే భారీ యంత్రంతో చదును
సకాలంలో స్పందించని అధికారులు



విఎంఆర్‌డిఏ భూమిలో ప్రైవేటు వ్యక్తులు నరికేసిన టేకు చెట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పరవాడ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ)కి చెందిన దాదాపు రూ.60 కోట్లు విలువైన సుమారు 6.76 ఎకరాల భూమిని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. దొంగలు పడ్డ ఆర్నెళ్లకు కుక్క మొరిగినట్లు భూమిని చదును చేసి, లక్షల రూపాయల విలువైన టేకు చెట్లు అమ్మేసి, పూర్వకాలం నాటి తాటి చెట్లు నేలమట్టం చేసిన వారం రోజులకుగానీ స్పందించలేదు. విఎంఆర్‌డిఎలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సహకారం ఆక్రమణదారులకు మరింత బలాన్ని ఇచ్చింది. సొంతభూమిని చదును చేస్తున్నట్లు పట్టపగలు భారీ యంత్రంతో గట్లు తీసేసి, ఇక్కడ చదును చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులు టిడిపికి చెందినవారైనా, వారి వెనుక వైసిపి నాయకుల హస్తముంది. ఇరు పార్టీల నాయకులు కలిసి ఎన్నికల హడావుడిలో ఎవరూ పట్టించుకోరని భావించి విఎంఆర్‌డిఎ భూమిని హస్తగతం చేసుకొని అమ్మకానికి సిద్ధంచేస్తున్నారు. చదునుచేస్తున్న భూమి దగ్గరకు వేరెవరూ రాకుండా కొంతమందిని పెట్టుకున్నారు. స్థలం దగ్గరకు వెళ్లినవారికి ఫొటోలు తీసి పంపించే ఏర్పాట్లు ఆక్రమణదారులు చేసుకున్నారు. ఆక్రమిస్తున్న భూమి దగ్గరకు వెళ్లడానికి భయానక వాతావరణాన్ని ఆక్రమణదారులు సృష్టించారు.

ఇంతకీ ఏం జరిగింది ?

1992లో మండల కేంద్రంలోని ఈదులపాక బోనంగి రెవెన్యూలోని సర్వే నెంబర్ 224లో 16.76 ఎకరాల భూమిని 27 మంది రైతుల నుంచి అప్పటి వుడా (విఎంఆర్‌డిఎ) సేకరించింది. 1994లో అవార్డు అయింది. రైతుల నుంచి సేకరించిన ఈ భూమిలో పదెకరాలతో పాటు 210, 212, 218 ఇతర సర్వే నెంబర్లలోని 20.12 ఎకరాలను 2004 మార్చి 12న స్వర్ణాంధ్ర మ్యూచవల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి (ఆర్.నెం.872/03/ఎఫ్5) కేటాయిస్తూ వుడా ప్రొసిడింగ్స్ ఇచ్చింది. సర్వే నెంబర్ 224లో హౌసింగ్ సొసైటీకి ఇవ్వగా మిగిలిన 6.76 ఎకరాల భూమికి కంచె వేయకుండా వదిలేసింది. గాజువాక-యలమంచిలి రోడ్డుకు అనుకొనివున్న ఈ భూమిపై స్థానిక నాయకుల కళ్లు పడ్డాయి. ఈ భూమి రైతులదని చెప్పి స్థానిక స్థిరాస్తి వ్యాపారులు విఎంఆర్‌డిఎకు చెందిన 6.76 ఎకరాల భూమిని చదును చేయడం ఆరంభించారు. రెవెన్యూ, అటవీశాఖ అనుమతి తీసుకోకుండా గుట్టుచప్పుడు లేకుండా లక్షల విలువైన టేకుచెట్లను విక్రయించారు. విఎంఆర్‌డిఎ భూమిని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించి చదును చేస్తున్నారని తహశీల్దార్ గణపతిరావు పరవాడ పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. విఎంఆర్‌డిఎ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చదును చేసిన వారం రోజులకుగానీ విఎంఆర్‌డిఎ అధికారులు స్పందించకపోవడంతో విలువైన టేకు చెట్లు కొట్టేశారు. తీరిక చూసుకొని మార్చి 30న విఎంఆర్‌డిఎ అధికారులు విఎంఆర్‌డిఎకు చెందిన భూమిని గొర్లె కనకారావు, గొర్లె సన్యాసినాయుడు సహా పలువురు ఆక్రమించారని పరవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయం విఎంఆర్‌డిఎ తహశీల్దార్ వీరభద్రరావు వద్ద ప్రస్తావించగా తమకు చెందిన భూమిని ఆక్రమిస్తున్న గొర్లె కనకారావు, గొర్లె సన్యాసినాయుడుపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

కెజిహెచ్ నర్సింగ్ కళాశాలలో

ర్యాగింగ్‌పై సిఎంకు ఫిర్యాదు

- విచారణకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో నడుస్తున్న గవర్నమెంట్ నర్సింగ్ కళాశాలలో వికృతమైన ర్యాగింగ్, చట్ట విరుద్ధమైన అసాంఘిక కార్యకలాపాలు, అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు అందింది. ఆ కళాశాలలో తృతీయ సంవత్సరం నర్సింగ్ చదువుతున్న భీమునిపట్నంకు చెందిన పైడిపల్లి సుజాత చేసిన ఈ ఫిర్యాదు బుధవారం కలకలం రేపింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెంటనే స్పందించి విద్యార్థిని ముఖ్యమంత్రికి రాసిన లేఖపై దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్‌డిఒ, కెజిహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఇక్కడి సిబ్బంది, ట్యూటర్స్ విద్యార్థినులను పలు విధాలుగా వేధిస్తున్నారని, వీరి వేధింపులు భరించలేక మధ్యలోనే కాలేజీ విడిచి పెట్టాలని పలుమార్లు భావించానని, అయితే తనపై ఎన్నో ఆశలు పెట్టుకొని తన తల్లిదండ్రులు ఇక్కడ చదివిస్తున్నారని, తమది నిరుపేద కుటుంబమని, వారిని బాధించడం ఇష్టం లేక భరిస్తున్నానని ఆ లేఖలో బాధితురాలు పేర్కొంది.

నిరాధారమైన ఫిర్యాదు : ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి

నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి మీడియాకు వివరణ ఇస్తూ.. ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ జరిగిందనడం సరికాదని, అందుకు ప్రిన్సిపాల్, సిబ్బంది బాధ్యులని విద్యార్థిని ఆరోపించడం తగదని అన్నారు. కాలేజీలో ఎటువంటి ర్యాగింగ్‌గూ జరగలేదన్నారు. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ఒక కమిటీని, స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని చాలా కాలం నుంచి నడుపుతున్నట్లు తెలిపారు. హాస్టల్ నిర్వహణ స్టూడెంట్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. విద్యార్థిని ఫిర్యాదు పూర్తిగా నిరాధారమైందని ఆమె ఖండించారు. తాను ఇదే కాలేజీలో నర్సింగ్ చదువుకొని ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నానని చెప్పారు.



రేఖపల్లిలో చేపట్టిన ర్యాలీ

పలుచోట్ల ఓటు విశిష్టతపై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రజాస్వామ్యంలో ఓటు విశిష్టతను తెలియజేస్తూ మండల కేంద్రం రేఖపల్లిలో తహశీల్దారు సయ్యద్ మౌలానా పజిల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి ఓటర్లకు అవగాహన కల్పించారు. ముందుగా రేకపల్లి క్రీడా మైదానంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చింతూరు ఐటిడిఏ పిఓ కావూరి చైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విలువైన ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో ఎస్ఐ నాగరాజు, ఐసిడిఎస్, విద్య, వైద్యఆరోగ్య శాఖల అధికారులు, ఎలక్ట్రోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బిఎల్‌ఓలు రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ బుధవారం చింతూరు మార్కెట్ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతూరు తహసిల్దార్ నజీముల్లా షా, ఐసిడిఎస్ సిడిపిఓ విజయ్ గౌరి, పంచాయతీరాజ్ డిఇ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై కళాజాతా

అడ్డతీగల : ఓటు హక్కు వినియోగంపై కళాజాతాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దారు నాగమణిమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎవరికైనా ఓటు లేకపోతే ఇప్పటికైనా వచ్చి ఓటు నమోదు చేయించుకోవాలని, వారికి ఐదు రోజుల్లోనే ఓటును కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలయ్య, కళాజాత బృందం పాల్గొన్నారు.

రంపచోడవరం : ఓటు విలువపై అవగాహన కల్పించడానికి నిర్వహించిన ర్యాలీని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దారు ఎ. కృష్ణ జ్యోతి ప్రారంభించారు. ఈ ర్యాలీ తహశీల్దారు కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు సాగింది. అనంతరం అక్కడ విభూది బ్రదర్స్ కళా నాటకం ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్‌బి రమణ, ఎంపీడీవో హరికృష్ణ, ఎస్ఐ మోహనరావు, డిటిలు యన్‌వివి సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు సూరమ్మ, ఇందిరా బాయ్, వీఆర్వోలు గణపతి, సిహెచ్. రవి, రమాదేవి, జి.ప్రభాకర్, జి.భూషణం, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.సుధా ప్రకాష్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సైన్స్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : సమా రిటర్న్ ఫర్ దినేషన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యాన హైదరాబాద్‌కు చెందిన హోండా మోటార్స్ గ్రూప్ సంస్థ వారి సహకారంతో చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల పరిధిలోని 32 పాఠశాలలకు 40 సైన్సు కిట్లు, కెరీర్ చార్టులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జి వెంకటేశ్వర్లు, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నడకతో ఆరోగ్యంగా ఉండొచ్చని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ అన్నారు. స్థానిక తెన్నేటి వాకర్స్ పార్కు, వైఎస్ఆర్ వ్యూ పాయింట్ పార్కు, రోప్ వే వాకర్స్ పార్కులలో ఆయన బుధవారం పర్యటించారు. వాకర్స్‌ను, సీనియర్ సిటిజన్స్‌ను కలిశారు. వారిని పలకరిస్తూ కాసేపు మార్నింగ్ వాక్ చేశారు. ఓట్లు అభ్యర్థించారు. ఇప్పటికే శివాజీపాలెం, అప్పుఘర్ ప్రాంతాల్లో వాకర్స్‌కు మార్నింగ్ వర్క్ చేసుకునే విధంగా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశామన్నారు.